

మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయంలో శనివారం భక్తజన సందడి కనిపించింది. ముందుగా భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలదేవస్థానం ధర్మపథంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడ వీధిలో ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



పర్యటన విజయవంతం చేద్దాం

పత్తికొండటౌన్: సీఎం వైఎస్ జగన్ పత్తికొండ పర్యటనను విజయవంతం చేద్దామని మంత్రి జయరాం పిలుపునిచ్చారు. శనివారం ఆయన సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.

8లో

న్యూస్‌రీల్

సరసమైన ధరలకే వస్తువులు



స్టాళ్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మాబున్నిసా, మెప్మా పీడీ నాగశివలీల

నంద్యాల(సిటీ): పట్టణ ప్రజలకు అవసరమైన వస్తువులు మెప్మా అర్బన్ మార్కెట్‌లో సరసమైన ధరకే లభిస్తాయని ఉమ్మడి జిల్లాల మెప్మా పీడీ నాగశివలీల, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మెప్మా అర్బన్ మార్కెట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. పట్టణాల్లో పేదరికాన్ని పారదోలేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా నిత్యావసర వస్తువులను మెప్మా అర్బన్ మార్కెట్ ద్వారా అందిస్తుందన్నారు. నంద్యాలలో ఏర్పాటు చేసిన మార్కెట్‌లో హ్యాండ్లూమ్ డిజైన్ వర్క్స్, షోకేష్ బొమ్మలు, వేస్ట్ మెటీరియల్‌తో చేసిన డోర్ మ్యాట్స్, కారంపొడి, పసుపు తదితర వంటింటి వస్తువులతో పాటు వివిధ రకాల స్వీట్స్, జ్యూట్ బాగ్స్, సాఫ్ట్ టాయ్స్ విక్రయిస్తున్నట్లు తెలిపారు. నెలలో ఒక రోజు మార్కెట్ నిర్వహణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావలి, మెప్మా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) విజయభాస్కర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిస్ట్రిక్ట్ వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

కర్నూలు(అర్బన్): వివిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2022 అక్టోబర్ 23వ తేదీన ఇచ్చిన నోటిఫికేషన్ మేరకు బ్యాక్‌లాగ్ డీఎస్సీ-టైపిస్టు అంధులు(వీహెచ్ జనరల్) ఉద్యోగానికి సంబంధించిన మెరిట్, తిరస్కరణ జాబితాలను డిస్ట్రిక్ట్ వెబ్‌సైట్‌లో ఉంచామని ఆ శాఖ సహాయ సంచాలకులు జి.వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ శాఖ కార్యాలయం నోటీసు బోర్డులో కూడా జాబితాలను ప్రచురించామని, అలాగే డిస్ట్రిక్ట్ వెబ్‌సైట్ www.kurnool.ap.gov.in,www.nandya.ap.gov.inలో జాబితాలను చూసుకోవచ్చని పేర్కొన్నారు.

కేడీసీసీ బ్యాంకు ఖాతా దారులకు కొత్త నెంబర్లు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీబీఎస్ సాఫ్ట్‌వేర్ నుంచి టీసీఎస్‌కు మారినందున కొత్త ఖాతా నెంబర్లు కేటాయిస్తున్నట్లు సీఈఓ పి.రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు సంబంధిత బ్యాంకు బ్రాంచీల ద్వారా కొత్త ఖాతా నెంబర్లను పొందాలని సూచించారు. ఆర్‌టీజీఎస్/ఎన్‌ఈఎఫ్‌టీ, ఇతర లావాదేవీలకు అంటే డీబీటీ, సబ్సిడీలు, ఎల్‌ఐసీ, పీఎఫ్‌ఎంఎస్, లోన్స్, ఐటీ రిటర్న్స్ వంటి వాటికి కొత్త నెంబర్లు మాత్రమే వినియోగించాలన్నారు. పాత ఖాతా నెంబర్లు వినియోగిస్తే ఈ నెల 31 నుంచి లావాదేవీలు విఫలమవుతాయని సూచించారు.

రాయితీపై సేద్యం పరికరాలు

నంద్యాల (సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం బిందు, తుంపర సేద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తునట్లు ఏపీఎంఐపీ ప్రాజెక్టు సంచాలకులు సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2023-24 సంవత్సరానికి 5వేల హెక్టార్ల సాగు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు వెల్లడించారు. బిందు సేద్యం పరికరాలు ఐదెకరాల్లోపు ఉన్న కర్షకులకు 90 శాతం, అంతకు మించి ఉన్న వారికి 70 శాతం రాయితీపై పరికరాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. తుంపర సేద్యం పరికరాలు ఐదెకరాల లోపు వారికి 55 శాతం, ఆపై 45 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న అన్నదాతలు సమీపంలోని ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వజ్రం లభ్యం

తుగ్గలి: చిన్నజొన్నగిరిలో శనివారం ఓ రైతుకు వజ్రం లభ్యమైనట్లు సమాచారం. వేరుశనగ పంట పొలంలో డ్రిప్ పైపులు మార్చే సమయంలో వజ్రం కంటపడింది. దాదాపు 3 క్యారెట్లు ఉన్న ఈ వజ్రాన్ని అనంతపురానికి చెందిన ఓ వజ్రాల వ్యాపారి టెండర్‌లో రూ.3.03లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది.



ప్రకృతి ఒడి.. ప్రశాంత లోగిలి!

సండే స్పెషల్



ఇంటిల్లిపాది ఆహ్లాదంగా గడుపుతాం

పట్టణాల్లో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోతుంది. అందుకే ఎమ్మిగనూరుకు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మా సొంత పొలంలోనే ఫాంహౌస్ కట్టుకున్నాం. ఉన్న ఇద్దరు కుమారులు మెట్రో నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. అయినప్పటికీ అక్కడ ప్రశాంతత లేదని చెబుతుంటారు. చిన్నబ్బాయి హర్ష ఉద్యోగం వదిలేసి ఇక్కడికొచ్చి వ్యవసాయం చేసుకుంటున్నాడు. యాంత్రిక జీవనం నుంచి బయటపడేందుకు, ఇంటిల్లి పాది సంతోషంగా గడిపేందుకు ఈ ప్రాంతం మాకు ఎంతో అనువుగా ఉంది. ప్రకృతి ఒడిలో సేదతీరితే ఎంతో ఆరోగ్యం.

– మాచాని నాగరాజు

ఊరికి దూరంగా ఇల్లు

- పట్టణాల్లో పెరిగిన వేడి వాతావరణం
- ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కాలుష్యం
- కరోనా నేర్పిన పాఠంతో ఆరోగ్యంపై దృష్టి
- వెంచర్లలో వ్యక్తిగత ఇళ్ల కొనుగోలుకు ఆసక్తి
- సొంత పొలాల్లో ఫాంహౌస్‌ల నిర్మాణం

కరోనా మహమ్మారి జీవనాన్ని కొత్త దారిలో తీసుకెళ్తోంది. పట్టణాల్లో చిన్న పని దొరికితే చాలు.. అపార్ట్‌మెంట్ ఎన్నో అంతస్తు అయినా పరవాలేదు.. సర్దుకుపోదాం అనే ధోరణి ఇప్పుడు తగ్గుతోంది. కాస్తంత రెంటు ఎక్కువైనా.. వ్యక్తిగత ఇల్లు మేలు అనే భావన ఇప్పుడు అధికమవుతోంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం.. కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్న నేపథ్యంలో పట్టణానికి కాస్త దూరమైనా ప్రశాంతమైన వాతావరణంలో నివసించేందుకు ఇష్టపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మొక్కలు నాటేందుకు ఇష్టపడని వారు కూడా.. ఇప్పుడు ప్రకృతితో మమేకమై జీవించేందుకు ఆసక్తి చూపుతుండటం విశేషం.

– సాక్షి, కర్నూలు డెస్క్

జిల్లాలోని ప్రధాన పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. పిల్లల చదువులు, ఉద్యోగం, ఇతరత్రా అవసరాల దృష్ట్యా చాలా మంది పల్లెల నుంచి పట్టణాలకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాలు పట్టణాల్లో కలిసిపోతున్నాయి. జనాభా పెరుగుతున్న కొద్దీ ఎక్కడా ఖాళీ స్థలం కనిపించని పరిస్థితి. అంతో ఇంతో స్థలం ఉందంటే అపార్ట్‌మెంట్, లేక షాపింగ్ కాంప్లెక్స్ కడదామనే ఆలోచన వస్తోంది. ఈ కారణంగా కనుచూపు మేరలో కాంక్రీటు వనాలే కనిపిస్తున్నాయి. ఫలితంగా ఉష్ణోగ్రతలు ఏడాదికేడాది విపరీతంగా పెరిగి ఆందోళన కలిగిస్తున్నాయి. అపార్ట్‌మెంట్ సంస్కృతి ఇటీవల కాలంలో అధికమైంది. ఉపాధి, ఉద్యోగంలో భాగంగా పట్టణాల్లో ఉండాల్సి రావడంతో ఎక్కడికక్కడ అపార్ట్‌మెంట్‌లు పుట్టుకొచ్చాయి. ఐదు అంతస్తులతో, వందలాది నివాసాలతో కూడిన ఈ కాంక్రీటు వనాలు మనుషులను దగ్గర చేస్తున్నా, మనసులను దూరంగా ఉంచుతున్నాయి. పక్కపక్కనే ఉంటున్నా ఎవరికి వారుగా బతికేస్తున్నారు. ఇక ఇటీవల కరోనా సృష్టించిన విలయం నేపథ్యంలో ఇలా ఇరుకిరుకు ప్లాట్లలో కాకుండా ఊరికి దూరంగా విశాలమైన వ్యక్తిగత ఇళ్లలో ఉండేందుకు ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.



నంద్యాల పట్టణానికి 8 కిలోమీటర్ల దూరంలో ఓ వెంచర్ రూపుదిద్దుకుంటోంది. మహానంది మండలం బుక్కాపురం వద్ద 17 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ వెంచర్‌లో 12 విల్లాలను ఒక్కొక్కటి 25 సెంట్ల స్థలంలో నిర్మించనున్నారు. మిగిలిన స్థలం అంతా పచ్చదనానికి కేటాయిస్తున్నారు. అంటే.. ప్రశాంత జీవనానికి ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో ఈ వెంచర్‌ను చూస్తే అర్థమవుతోంది.



కర్నూలులో కాంక్రీట్ వనాలను తలపిస్తున్న అపార్ట్‌మెంట్లు

పచ్చని చెట్లు కనుమరుగు

పట్టణాల పరిధి పెరుగుతున్న కొద్దీ చుట్టుపక్క గ్రామాలు అందులో విలీనం అవుతున్నాయి. ఈ కారణంగా అభివృద్ధి విస్తరిస్తుండటంతో గ్రామీణ వాతావరణం కనుమరుగవుతోంది. శివారు కాలనీల్లో పెద్ద పెద్ద బిల్డింగ్‌లు పుట్టుకొస్తుండగా.. ఆ ప్రాంతంలోని చెట్లు తొలగించక తప్పని పరిస్థితి. కొంత స్థలం ఉందంటే చాలు.. రెండు ఇల్లు కట్టుకొని, ఒకటి బాడుగకు ఇచ్చుకోవడమో.. లేదంటే అపార్ట్‌మెంట్ కడితే జీవనానికి కాస్త ఊరట కలిగిస్తుందనే ఆశ పచ్చని చెట్లకు శాపమవుతోంది.

ఉమ్మడి కర్నూలు జిల్లా భూభాగం : 17,172 చ.కిలోమీటర్లు	
అడవులు ఉండాల్సిన శాతం:	33
ప్రస్తుతం అడవుల శాతం:	20.29
ఈ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రతలు	
గరిష్టం: 46.2	కనిష్టం: 32

పల్లెకు పోదాం..

పట్టణాల్లో వాతావరణం రోజురోజుకూ కాలుష్యంతో నిండుకుంటోంది. ఇంటి నుంచి బయటకు వచ్చి ఎక్కడన్నా సేదతీరుదామంటే చెట్టు నీడను వెతుక్కోవాల్సిందే. సెంటు స్థలం ఉందంటే చాలు రోడ్డు పక్కనైతే దుకాణం కడుతున్నారు. ఇతర ప్రాంతాల్లో అయితే ఇంటి ఆలోచన చేస్తున్నారు. ఈ కారణంగా మధ్య తరగతి ప్రజలు తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నగరానికి దూరంగా, పల్లెలకు సమీపంలోని వెంచర్లలో ప్లాట్లు కొంటున్నారు. పదవీ విరమణ వయస్సు తర్వాత పల్లె వాతావరణంలో సేద తీరేందుకు ఇష్టపడుతున్నారు.

అభిరుచికి అనుగుణంగా వెంచర్లు

కొనుగోలుదారుల అభిరుచికి అనుగుణంగా రియల్ ఎస్టేట్ కూడా తన స్వరూపాన్ని మార్చుకుంటోంది. ఇప్పటి వరకు 3 నుంచి 5 సెంట్ల స్థలాలతో వెంచర్లు ఉండగా.. ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా 25 సెంట్ల స్థలాలతో వెంచర్లు వెలుస్తున్నాయి. ముఖ్యంగా వ్యాపారులు, అధికారులు, వైద్యులు ఈవిధమైన వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. రియల్టర్లు ఇలాంటి వాళ్లను ఎంపిక చేసుకొని అందుకు అనుగుణంగా వెంచర్లలో సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇలాంటి వెంచర్లలో ప్లాట్లు కూడా పరిమితంగా ఉంటుండటం విశేషం.

ప్రశాంతత కోసం..



కరోనా నేర్పిన పాఠం ఎప్పటికీ మర్చిపోలేం. నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. జనాభా అధికం కావడంతో ఇరుకు ప్రాంతాల్లో సర్దుకుపోయి జీవించాల్సిన పరిస్థితి. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఊరి బయట ప్రశాంత వాతావరణంలో ఇటీవల వ్యక్తిగత ఇల్లు నిర్మించుకున్నాం. గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రాంతంలో నివాసం ఉంటే వ్యాధుల బారి నుంచి కొంతవరకైనా బయట పడొచ్చు. – హరగోపాల్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కర్నూలు

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ప్రతి ఊరికి రోడ్డు సౌకర్యం
- ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు
- అర్హులందరికీ ఇళ్ల పట్టాలు
- వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన



మండుటెండలో పాదయాత్ర చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్యాపిలి: గ్రామాల అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జలదుర్గం గ్రామం నుంచి డోన్‌కు వెళ్లే రహదారి వరకు రూ. 2 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డుకు శనివారం మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం గోపాలనగరం నుంచి ఊటకొండ వరకు రూ.1.5 కోట్లతో కొత్తగా నిర్మించిన రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఊటకొండ గ్రామంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో పల్లెలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. మారుమూల గ్రామంలో కూడా కనీస సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. డోన్ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రూ.300 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించే పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఊటకొండ గ్రామంలో 2.3 కోట్లతో చెరువు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో చెరువులు నింపే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి బుగ్గన అధికారులను ఆదేశించారు. గ్రామంలో అర్హులైన పేదలను గుర్తించి వెంటనే ఇళ్ల పట్టాలు ఇచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, ఏఈ శ్రీకాంత్ రెడ్డి, ఏఈ మధు, పీఆర్ ఏఈ రామకృష్ణారెడ్డి, డీఈ నాగిరెడ్డి, ఏఈ ప్రభాకర్ రెడ్డి, కాంట్రాక్టర్ రెడ్డప్ప రెడ్డి, ఎంపీటీసీ మద్దయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి,జగన్‌మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, వీరభద్రాచారి, దస్తగిరి గౌడ్, మధుసూదన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, రాముడు పాల్గొన్నారు.

మండుటెండలో మంత్రి పాదయాత్ర

మండల పరిధిలోని గోపాలనగరం-ఊటకొండ రోడ్డును ప్రారంభించిన అనంతరం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అదే రోడ్డుపై పాదయాత్ర చేశారు. ఉదయం 11 గంటలకు పాదయాత్ర ప్రారంభించిన మంత్రి మండుటెండను సైతం లెక్క చేయకుండా మూడు కిలోమీటర్ల మేర నడిచారు. మార్గం మధ్యలో ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు.

ప్యాపిలిలో టీడీపీకి భారీ షాక్



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన మైనారిటీ నాయకులతో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

డోన్ నియోజకవర్గంలో తన ఉనికి చాటుకునేందుకు తాపత్రయ పడుతున్న టీడీపీకి భారీ షాక్ తగిలింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి బుగ్గన చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీకి ఆకర్షితులవుతున్నారు. శనివారం మైనారిటీ, తెలుగు, బోయ సామాజిక వర్గాలకు చెందిన దాదాపు 400 కుటుంబాలు టీడీపీని వీడి మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఇందులో ప్యాపిలి జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు మస్తాన్ ఖాన్, షేక్షావలి ఆధ్వర్యంలో 100 మైనారిటీ కుటుంబాలు, మెలిగిరి నరేశ్, చెన్నయ్య, బింగమ్మ గారి వెంకటరాముడు తదితరులతో కలిసి 200 కుటుంబాలు, హరి తరిమేని, రాము తదితరులతో కలిసి మరో 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. అలాగే పట్టణానికి చెందిన తొప్పెల చిన్న శ్రీనివాసులు, పుట్టా మద్దిలేటి, నాగరాజు తదితరులతో కలిసి 50 కుటుంబాలు, తెలుగు సాయి, మధుతో కలిసి మరో 15 కుటుంబాలు పార్టీలోకి చేరాయి. వీరందరికీ మంత్రి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దిలీప్ చక్రవర్తి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

రూ.48.16 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ

- ఈ నెల 30న రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్న సీఎం

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది మార్చి నుంచి మే వరకు కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 30న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాలకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయనున్నారు. టీడీపీ హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు కొన్నేళ్లు పట్టేది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం జాప్యం లేకుండా నష్టపోయిన రైతులను ఆదుకుంటుండటం విశేషం. కర్నూలు జిల్లాలో అకాల వర్షాల వల్ల 574 మంది రైతులకు సంబంధించి 396.63 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వీరికి రూ.48.16 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ కింద విడుదల కానుంది.

ఇన్‌చార్జ్ బాధ్యతల తొలగింపు

కర్నూలు కల్చరల్: దేవదాయశాఖ గ్రేడ్–3 ఈవో దినేష్‌కు ఉన్న కర్నూలు గ్రూప్–2, గ్రూప్–3, మామిదాల గ్రూప్ టెంపుల్స్ ఇన్‌చార్జ్ బాధ్యతలను తప్పించారు. గార్గేయపురం గ్రూప్ టెంపుల్స్ ఈవో సీతారామిరెడ్డికి కర్నూలు గ్రూప్–2 టెంపుల్స్, కాల్వబుగ్గ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్‌కు కర్నూలు గ్రూప్–3 టెంపుల్స్ బాధ్యతలు అప్పగించారు. దిన్నెదేవర పాడు ఈవో కామేశ్వరికి మాధవ ఆంజనేయ స్వామి గ్రూప్ టెంపుల్స్, కర్నూలు అమృతేశ్వరస్వామి ఆలయం, రేమట మూల రామలింగేశ్వర స్వామి ఆలయాలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఏసీ ఆదిశేషునాయుడు తెలిపారు.

శారీరక వికలాంగులకు హాస్టల్ వసతి

● 3వ తరగతి నుంచి పీజీ వరకు అవకాశం

కర్నూలు(అర్బన్): జిల్లా కేంద్రంలోని సి.క్యాంప్ సమీపంలో ప్రభుత్వ శారీరక వికలాంగుల బాలుర వసతి గృహంలో ప్రవేశం పొందేందుకు జూన్ 10వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వసతి గృహంలో వంద మంది విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 3వ తరగతి నుంచి పీజీ, ఇతర కోర్సులు చదువుతున్న శారీరక వికలాంగులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన వారు కూడా ప్రవేశం పొందవచ్చన్నారు. విద్యార్థులకు ఉచిత భోజనం, పుస్తకాలు, దుస్తులు, కాస్మోటిక్ చార్జీలు తదితరాలను అందిస్తామన్నారు. వివరాలకు 9393712179, 9989309021 నెంబర్లతో పాటు కార్యాలయ ఫోన్ నెంబర్ 08518–277864ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

● కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం


మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం

పత్తికొండటౌన్: ఈనెల 30వ తేదీన పత్తికొండలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటననువిజయవంతం చేద్దామని రాష్ట్ర కార్మిక శాఖమంత్రి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. శనివారం పత్తికొండ పట్టణంలోని స్త్రీ శక్తి భవన్‌లో సీఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లాస్థాయి అధికారులతో మంత్రి గుమ్మనూరు జయరాం, జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పత్తికొండ పర్యటనకు వస్తున్న మే 30వతేదికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఆ రోజుకు సీఎంగా ప్రమాణస్వీకారం చేసి 4 ఏళ్లు పూర్తవుతుందన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద అభిమానంతో, ఆయనను చూసేందుకు వేలాదిగా ప్రజలు తరలి వస్తారని, వారికి ఇబ్బంది లేకుండా పోలీసులు సహకరించాలన్నారు. సభాప్రాంగణంలోకి వచ్చిన ప్రజలకు తాగునీరు, మజ్జిగ అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈని ఆదేశించారు.

➡ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న 5 కార్యక్రమాలను విజయవంతం చేశారన్నారు. అదేస్థాయిలో ఈ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేసేలా అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

➡ జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన మాట్లాడుతూ.. అధికారులందరూ వారికి కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించి, రైతుభరోసా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బహిరంగసభకు తరలివచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సభకు వచ్చేవారికి రవాణా సౌకర్యం కోసం బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెలిప్యాడ్ వద్ద ఒకటి, సభాప్రాంగణం వద్ద 5 మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్యను ఆదేశించారు.

➡ పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. జిల్లాల విభజన తర్వాత వెనుకబడిన పత్తికొండ, ఆలూరుపై సీఎం ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం పత్తికొండ కేంద్రంగా రెవెన్యూ డివిజన్, పోలీసు సబ్‌డివిజన్ ఏర్పాటు చాలా సంతోషం అన్నారు. సీఎం హోదాలో పత్తికొండకు మొదటిసారిగా వస్తున్నందున పర్యటన విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

➡ ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ.. సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్, సెబ్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఆర్‌డీఓ మోహన్‌దాసు, డీఎస్పీ శ్రీనివాసులు, అన్ని ప్రభుత్వశాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో గందరగోళం!

● సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పట్టించుకోని డీఈఓ
● హడావుడిగా ఆఖరిరోజు కార్యక్రమం

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం నెలకొంది. షెడ్యూల్ ప్రకారం బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను శనివారం లోపు వెరిఫికేషన్ చేయాలి. కానీ జిల్లా విద్యాశాఖ అధికారి ఈ విషయాన్ని పట్టించుకోలేదు. హడావుడిగా ఆఖరిరోజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో 6,947 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,763 మంది కంపల్సరీ, 5,184 మంది రిక్వెస్ట్ బదిలీలు కోరుకున్నారు. బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఈ నెల 24న మొదలై 26వ తేదీతో ముగిసింది. ఆన్‌లైన్ దరఖాస్తులను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని 25వ తేదీ నుంచి వెరిఫికేషన్ చేయించుకోవాల్సిన బాధ్యత ఎంఈఓలపై ఉంటుంది. చేయించాల్సిన బాధ్యత డీఈఓపై ఉంది. అయితే వెరిఫికేషన్‌కు శనివారం చివరి రోజున కేవలం మూడు మండలాలకు చెందిన ఎంఈఓలు మాత్రమే వెబ్‌సైట్ నుంచి వచ్చిన దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని డీఈఓ కార్యాలయానికి వచ్చారు. అసలు ఈ విషయమే తనకు సంబంధం లేదన్నట్లు డీఈఓ ఉండడంతో ఓ ఉద్యోగి వెళ్లి సార్..వెరిఫికేషన్‌కు ఈ రోజు ఆఖరు అని చెప్పడంతో హడావుడి చేశారు. పర్యవేక్షకులు అప్రమత్తమై అన్ని మండలాలకు చెందిన ఎంఈఓలను సంప్రదించి దరఖాస్తులను తనిఖీ చేయించే ప్రక్రియ మొదలుపెట్టారు. శనివారం సాయంత్రం 6.30 గంటల వరకు ఉమ్మడి జిల్లాలో ఇంకా 7 మండలాలకు చెందిన వారి దరఖాస్తులు వెబ్‌సైట్ నుంచే డౌన్‌లోడ్ చేయలేదని తెలిసింది. మొత్తం 53 మండలాలకుగాను 34 మండలాలకు చెందిన వారి దరఖాస్తులు మాత్రమే వెరిఫికేషన్ చేయించినట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏ కారణం చేతనైనా సస్పెండ్ అయినా, ఇప్పటికీ సస్పెండ్‌లో ఉన్నా.. అలాంటి వారు బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులని జాయింట్ డైరెక్టర్ స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. డీఈఓ మాత్రం ఎంఈఓల వాట్సప్ గ్రూప్‌లో గతేడాది టెన్త్ క్లాసు పరీక్షల విషయంలో సస్పెండ్ అయిన వారి దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పడం గందరగోళానికి దారి తీసింది.

బంగారు వ్యాపారి బలవన్మరణం


ముల్లా మహబూబ్ (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్: అప్పుల బాధతో బంగారు వ్యాపారి ముల్లా మహబూబ్(28) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఈ ఘటన ఎమ్మిగనూరు పట్టణం ఎన్టీఆర్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన రహంతుల్లా, జలీనాలకు ముగ్గురు సంతానం. వీరిలో చివరి వాడైన ముల్లా మహబూబ్ స్థానిక కొండవీటి ప్రాంతంలో బంగారు షాపు పెట్టుకుని వ్యాపారం చేసుకునే వాడు. వ్యాపార కోసం బయట వ్యక్తుల దగ్గర డబ్బు రూ. 10 లక్షల వరకు అప్పు చేసాడు. వ్యాపారం జరగక పోవటంతో అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. అప్పుల బాధ భరించ లేక ఉదయం షాపుకు వెళ్లి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు గోనెగండ్లలో బంధువు అంత్యక్రియలకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహబూబ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతున్న మహబూబ్‌ను చూసిన మృతుడి అన్న కుమారుడు చికిల్ కేకలు వేయడంతో ఇంటి పక్కల వాళ్లు వచ్చి చూశారు. అప్పటికే మహబూబ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి రహంతుల్లా మూడు నెలల క్రితం చనిపోయాడు. పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఇంటికి వచ్చి ఆత్మహత్య చేసుకున్న తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. మహబూబ్‌కు పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులు సంబంధాలు చూస్తున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ మధుసూదన్‌రావు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని అర్బన్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని ఆదోని పట్టణంలోని సిరుగుప్ప చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఆదోని వన్‌టౌన్ సీఐ విక్రమసింహ శనివారం విలేకరులకు తెలిపారు. మట్కా బీటర్ అయిన గణేష్ సర్కిల్‌కు చెందిన యువరాజ్, బబ్బులమ్మగుడికి చెందిన హనుమన్న, బోయ గేరికి చెందిన వీరేష్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. రెండు లగేజీ బ్యాగ్‌లలో వీరు ఏడు బాక్సుల కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డారని, వారిపై కేసు నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని 9121101135 నంబర్‌కు అందించాలని సూచించారు. ఎస్‌ఐ జహీర్, హెడ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్ సిబ్బంది బదిలీ

బొమ్మలసత్రం: జిల్లాలోని పలు స్టేషన్‌లలో పని చేస్తున్న 58 మంది పోలీస్ సిబ్బందిని ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి శనివారం బదిలీ చేశారు. ఒకే స్టేషన్‌లో 5 ఏళ్లకు పైబడి విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి స్థానచలనం కల్పించారు. ఇందులో 7 మంది ఏఎస్‌ఐలు, 15 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 11 మంది మహిళా పోలీసులు, 25 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని సొంత మండలాలు, గతంలో పనిచేసిన స్టేషన్లను మినహాయించి ఇతర స్టేషన్లకు బదిలీ చేశారు.

టీచర్ల పదోన్నతులపై తప్పుడు ప్రచారం

● నష్టపోతున్న సీనియర్ ఉపాధ్యాయులు



కర్నూలు(సిటీ): ఉపాధ్యాయుల పదోన్నతులపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దీంతో సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారు. సాధారణంగా పాఠశాల విద్యలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు ఎప్పటికో వచ్చేవి కాదు. అవి కూడా చాలా తక్కువ మందికి అందేవి. ప్రస్తుతం ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా , హైస్కూల్ ప్లస్ స్కూళ్లలో పీజీటీలుగా పదోన్నతి కల్పిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో ఆయా కేడర్లకు చెందిన 1,461 మందికి పదోన్నతులు రానున్నాయి. అయితే కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు.. గతేడాది పదోన్నతుల సమయంలో రూ.2,500 ప్రోత్సాహకం ఇస్తామని చెప్పి విద్యాశాఖ ఇవ్వలేదని, ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతులు సైతం అలాంటివేనని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలాగే హైస్కూళ్లలో ప్రస్తుతం ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలు ఇస్తున్నారని, సిలబస్ బోధించడం కష్టమనే భావనను ఉపాధ్యాయుల్లో కల్పిస్తున్నారు. దీంతో సీనియర్లు అయిన కొందరు ఉపాధ్యాయులు పదోన్నతులకు ముందుకు రాకపోవడంతో జూనియర్లకు అవకాశం వస్తోంది. ఇదిలా ఉండగా పదోన్నతులకు నాట్ విల్లింగ్ ఎక్కువ మంది ఇవ్వడంతో ఎస్‌జీటీ పోస్టులు సర్‌ప్లస్ అయితే పక్క జిల్లాలకు మళ్లించే అవకాశం ఉంది.

పదోన్నతులకు పెరిగిన 121 పోస్టులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఉన్నత, ప్రాథమికోన్నత, విలీన పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తున్నారు. మొత్తం 1,337 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగాను, 124 మంది స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించనున్నారు. పదోన్నతుల్లో అదనంగా 199 వివిధ సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్, రెండు హెచ్‌ఎం పోస్టులు పెరగనున్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. పదోన్నతులు వద్దంటూ నాట్ విల్లింగ్ ఫారాలు తీసుకునేందుకు ఈ నెల 21, 22 తేదీలతోనే గడువు ముగిసింది. అయినా నాట్ విల్లింగ్ ఫారాలు తీసుకుంటుడడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో విల్లింగ్ జాబితా

పదోన్నతులకు ఆసక్తి చూపని ఎస్‌జీటీల నుంచి ఈ నెల 24వ తేదీ వరకు నాట్ విల్లింగ్ ఫారాలను తీసుకున్నామని, తుది విల్లింగ్(పదోన్నతులకు అంగీకారం తెలిపిన) జాబితా డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోన్నతులకు అర్హులైన ఎస్‌జీటీల తాత్కాలిక సీనియారిటీ జాబితా వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. ఎవరైనా పదోన్నతులు వద్దనుకుంటే నాట్ విల్లింగ్ ఫారాలను ఏక్యాంపులోని ఇందిరాగాంధీ మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్‌లోని కౌంటర్లలో అందజేయాలన్నారు.